క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు కుప్పం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

కుప్పం రూరల్: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు కుప్పం మండలం, టి. సదుమూరు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు పద్మనాభరాజు తెలిపారు. గురువారం రామచంద్రాపురం మండలం నెత్తకుప్పం జెడ్పీ హైస్కూల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ స్కూల్ 9వ తరగతి విద్యార్థులు పద్మశ్రీ, భువనేష్ త్రోబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని సదుమూరు హెచ్ఎం చెప్పారు. వారిని టీచర్లు అభినందించారు.

త్రోబాల్ పోటీలకు చిన్నేపల్లె విద్యార్థి



సయీద్

పెద్దపంజాణి: మండలంలోని చిన్నేపల్లె జెడ్పీ హైస్కూల్(ఉర్దూ)లో 8వ తరగతి చదువుతున్న ఎస్‌పి.మహమ్మద్ సయీద్ అండర్-14 బాలుర విభాగం చిత్తూరు జిల్లా త్రోబాల్ జట్టుకు ఎంపికయ్యాడని హెచ్ఎం మార్రెడ్ల భాస్కర్, పీడీ భవాని శుక్రవారం తెలిపారు. ఇటీవల రామచంద్రాపురం మండలం నెత్తకుప్పంలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడని, ఈ నెల 28న పూతలపట్టులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో సయీద్ పాల్గొంటాడని చెప్పారు.

జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపిక



అఫ్రీద్

చౌడేపల్లె: ఎస్‌జీఎఫ్ అండర్-17 సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు మర్రిమాకులపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థిని అఫ్రీద్ ఎంపికైందని హెచ్ఎం నాదమునినాయుడు శుక్రవారం తెలిపారు. ఈనెల 23 నుంచి మూడురోజుల పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా గుంతకల్లులో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో అఫ్రీద్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని చెప్పారు. వ్యాయామోపాధ్యాయుడు పవన్‌కుమార్, హెచ్ఎం, ఉపాధ్యాయులు అఫ్రీద్‌ను అభినందించారు.

27న ఖాళీ జాగాల వేలం

పుంగనూరు: స్థానిక ప్రైవేటు బస్టాండులో ఖాళీ జాగాల వేలం పాటను ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. గతవారం నిర్వహించిన 6 ఖాళీ స్థలాల వేలానికి పాటదారులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. ఈనెల 8న జారీ చేసిన నోటీసు నిబంధనల మేరకు వేలం నిర్వహిస్తామన్నారు.

24న ఉచిత వైద్య శిబిరం

పుంగనూరు: పట్టణ సమీపంలోని గూడూరుపల్లె వద్ద ఉన్న జగనన్న కాలనీ, టిడ్కో గృహాల వద్ద ఈనెల 24న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అబ్దుల్ కలామ్ ట్రస్ట్ అధ్యక్షుడు అయూబ్ అలీఖాన్ శుక్రవారం తెలిపారు.ఉయ్యాలవాడ జయంతి పురస్కరించుకుని కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యుల సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు

పుంగనూరు: వినియోగదారులు సకాలంలో బకాయిలు చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, బిల్లులు చెల్లించడంలో ప్రజలు నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. అలాగే పలు ప్రాంతాలలో విద్యుత్ చౌర్యం జరుగుతోందని, తనిఖీలలో విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు తేలితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామనిహెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, కరుణాకరరెడ్డిని సన్మానిస్తున్న పలమనేరు వైఎస్సార్‌సీపీ నాయకులు





కూటమికి అక్కాచెల్లెళ్ల ఉసురు తప్పదు

- రాష్ట్రంలో 'రెడ్‌బుక్' పాలన
- వడ్డీతో సహా దెబ్బకు దెబ్బ రుచి చూపుతాం
- నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు/గంగవరం: సూపర్‌సిక్స్ పేరిట జనాన్ని మోసం చేసి ఎన్నికల్లో గెలిచిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా నిలువునా మోసం చేసిందని, అందుకే అక్కచెల్లెమ్మల ఉసురుకు పతనం కాక తప్పదని పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద ఓ కళ్యాణ మండపంలో శుక్రవారం నియోజకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి హాజరయ్యారు. అధ్యక్షత వహించి వెంకటేగౌడ మాట్లాడారు. చంద్రబాబు ఇచ్చిన ఎన్నికల హామీలను నమ్మి మోసపోవద్దని అప్పట్లోనే జగనన్న పదే పదే చెప్పినా జనం నమ్మలేదన్నారు. తల్లికి వందనమంటూ తండ్రి చేతికి మందు బుడ్డీనిచ్చిన కూటమి పాలనను చూసిన జనం చీదరించుకుంటున్నారన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ఓడింది వైఎస్సార్‌సీపీ కాదని ప్రజలే ఓడారన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు రెడ్‌బుక్ పాలన నడుస్తోందని, ఎటుచూసినా అక్రమాలు, హత్యలు, అరాచకాలు, లైంగికదాడులు పెచ్చుమీరాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము ఇప్పటి కూటమి నేతల్లా గతంలో ఆలోచించి ఉంటే ఈ టీడీపీ నాయకులు ఊర్లలో ఉండేవారా? అని ప్రశ్నించారు. ప్రజలే ఈ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపే రోజులొస్తాయన్నారు.

మరి కొందరు ఏం మాట్లాడారంటే..

చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల పేరిట చేసిన వంచన, దగాను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారని, తమను నిండా మోసగించాడని మండిపడుతున్నారని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ విమర్శించారు. రాష్ట్రంలో 33వేలమంది మహిళలు ఏమైపోయారని ఊగిపోయిన పవన్‌కళ్యాణ్ ఇప్పుడు రాష్ట్రంలో మహిళలపై సాగుతున్న లైంగికదాడులు, హత్యలపై ఎందుకు నోరు లేపడం లేదని నాయకులు గణేష్‌యాదవ్ ఘాటుగా విమర్శించారు. మండల కన్వీనర్లు బాలాజీనాయుడు, బాగారెడ్డి, ప్రహ్లాద, జాఫర్, కేశవులు, చెంగారెడ్డి, వీ.కోట ఎంపీపీ యువరాజ్, మైనారిటీ నేత రహీంఖాన్, కండల నరేష్ తదితరులు మాట్లాడారు. నాడు వైఎస్సార్ సీపీ పాలనలో అర్హులకే ప్రభుత్వ పథకాలందేవని, ఇప్పుడు కూటమి నేతలు చెప్పిన వారికే పథకాలు అందుతున్నాయని మండిపడ్డారు. కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో సముచితస్థానాన్ని కల్పించాలన్నారు. పార్టీ క్యాడర్‌కు నాయకుల అండదండలుండాలన్నారు. కరుణన్న ఓ పోరాట యోధునిలా పార్టీని ముందుకుతీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీలు సుష్మాకీర్తి, పార్వతిచంద్ర, ఎంపీపీ వెంకటరమణ, మురళీకృష్ణ, రాజేంద్రన్, నియోజకవర్గంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, పెద్దసంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు నూతనోత్తేజం

నియోజకవర్గ స్థాయి సమావేశంతో పార్టీ శ్రేణులకు నూతనోత్సాహం వచ్చింది. అంచనాలకు మించిన జనం రాకతో మండపం కిక్కిరిసిపోయింది. లోన కూర్చునేందుకు స్థలం లేకపోవడంతో పలు వురు కిటికీల పక్కన నుంచి వెలుపల నుంచి నాయకుల ప్రసంగాలు ఆలకించారు. కూటమి నేతల దాడులు, అరాచకాలకు జడిసేది లేదని, పార్టీ అండగా ఉంటుందని ఒక బలమైన సందేశాన్ని క్యాడర్‌కు ఇవ్వడంలో పార్టీ నాయకులు కృతకృత్యులయ్యారు.

ఎప్పుడైనా సింగిల్‌గా గెలిచాడా?



గతంలో మామకు వెన్నుపోటు.. ఆపై మరో పార్టీతో జత కట్టి చంద్రబాబు సీఎం అయ్యారు. ఇప్పుడు కూటమిగా ఏర్పాటై ముఖ్యమంత్రి అయ్యారు. ఈ ప్రభుత్వంలో పేదలు మరింత పేదలు కావాలని, ధనికులు మరింత కోటీశ్వరులు కావాలనే పాలన సాగుతోంది. వలంటీర్లు సైతం చంద్రబాబు హామీని నమ్మి ఇప్పుడు నిండా మునిగారు.
–నారాయణస్వామి, మాజీ డిప్యూటీ సీఎం

నోటికి తాళం వేసుకున్న పవన్ కళ్యాణ్



రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక సాగుతున్న అరాచకాలు, దోపిడీలు, ఇసుక దందా, గ్రామాల్లో ఎటుచూసినా బెల్టుషాపులు, ఉపాధిలో అక్రమాలను చూసి జనం ఇదేమి పాలనరా దేవుడా? అని ఆందోళన చెందుతున్నారు. ఎవరు అన్యాయం చేసినా ప్రశ్నిస్తానన్న పవన్‌కళ్యాణ్ ఈ అక్రమాలపై నోరు మెదపడం లేదు. నోటికి తాళం వేసుకున్నారా? ఉద్యమనేత భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో పార్టీని బలోపేతం చేయడం ఖాయం.
–శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్

కరువు, చంద్రబాబు అన్నదమ్ములే



కరువు, చంద్రబాబు ఎప్పుడూ అన్నదమ్ములే. ఆయన ఎప్పుడు సీఎం అయినా ఈ ప్రాంతం కరువు పరిస్థితులు తాండవిస్తుంటాయి. ఇప్పుడు ఈ ప్రభుత్వమే ఇక్కడ కరువు మండలాలను ప్రకటించడమే దీనికి ఉదాహరణ. హంద్రీ-నీవా జలాలతో ఇక్కడి చెరువులను నింపాలి.
–బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి

ఈవీఎంలతో గెలిచిన కూటమి



సొంతంగా పార్టీని పెట్టి ఘనవిజయం సాధించిన నేత జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే. కూటమి ప్రభుత్వం ఈవీఎంలతో గెలిచిందే గానీ జనం ఓట్లతో కాదు. ఇప్పటికీ దీని మీద చర్చ నడుస్తూనే ఉంది. వ్యవస్థల్ని మేనేజ్ చేయడంలో ఆరితేరిన చంద్రబాబు ఇవేవీ కొత్త కాదు.
–మాజీ ఎంపీ రెడ్డెప్ప

మళ్లీ పూర్వ వైభవం వస్తుంది



కరుణాకరరెడ్డి సారథ్యంలో ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్‌సీపీకి పూర్వవైభవం వస్తుంది. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎప్పటికప్పుడు ఎండగడదాం. కూటమి దాడులు, దౌర్జన్యాల నుంచి పార్టీ శ్రేణులకు అండగా నిలబడదాం.
–తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

పార్టీ అధినేతను కలిసిన ఎమ్మెల్సీ, సర్పంచ్



వైఎస్ జగన్‌తో సర్పంచ్ మోహన్ నాయక్, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో రామకుప్పం మండలం పెద్దతండా సర్పంచ్ మోహన్ నాయక్ కలిశారు. తండా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మోహన్ పార్టీ అధినేతకు వివరించారు. అలాగే కుప్పంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. పార్టీలో ఎస్టీలకు తగిన ప్రాధాన్యతనిస్తున్నట్లు వైఎస్ జగన్ చెప్పారని మోహన్ తెలిపారు.

ట్రూఅప్ చార్జీలతో బాదుడు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

పలమనేరు: ట్రూఅప్ చార్జీల పేరిట కరెంట్ చార్జీలను పెంచి సామాన్యుల నడ్డి విరిచేందుకు కూటమి సర్కార్ సిద్ధమవుతోందని, కరెంట్ చార్జీలను పెంచితే రాష్ట్రంలో ఉద్యమాలు తప్పవని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పలు పన్నుల రూపంలో ప్రభుత్వం బాదుడు మొదలెట్టడంతో ప్రజలు లబోదిబోమంటున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలను పెంచమని ఎన్నికల హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు ఎలా కరెంట్ చార్జీలను పెంచుతున్నారని ప్రశ్నించారు. ట్రూఅప్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు మంజునాథ్, చెన్నకేశవులు, గుర్రప్ప, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

26న చిత్తూరులో ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

పలమనేరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసనగా ఈనెల 26న చిత్తూరులో కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నాయకులతో కలసి మాట్లాడారు. కుక్కతోక వంకరని కూటమి ప్రభుత్వం మరోసారి నిరూపించుకుందన్నారు. ప్రజలకు తిండి పెట్టే రైతులకు ఈ ప్రభుత్వంలో మేలు కంటే నష్టమే ఎక్కువగా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్త, మధ్యాహ్న భోజన పథక కార్మికుల అసోసియేషన్ నాయకురాళ్లు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు



బోయకొండలో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తిప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించారు. తొలుత వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూల తోరణాలతో ముస్తాబు చేశారు. ఆలయ ఈఓ ఏకాంబరం కార్తీక మాసం మూడవ శుక్రవారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు ఉపవాస దీక్షలతో తరలి వచ్చిన అమ్మవారికి పూజలు చేశారు.

భక్తులకు అన్నదానం

బోయకొండ గంగమ్మ ఆలయంలో ఉచిత అన్నప్రసాద కేంద్రం వద్ద భక్తులకు ఈఓ ఏకాంబరం పర్యవేక్షణలో అన్నప్రసాదాలు వడ్డించారు. ఉచితఅన్నప్రసాద నిర్వహణకు దాతలు తోడ్పాటునివ్వాలని కోరారు.

ఆర్టీసీ బస్సు ఢీ: మోటార్ సైక్లిస్టులకు తీవ్రగాయాలు



సంఘటన స్థలంలో తీవ్ర గాయాలతో పడివున్న రవి, రమేష్

కుప్పం రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి కుప్పం మండలం కమతమూరు క్రాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. కుప్పం మండలం సజ్జలపల్లెకు చెందిన రవి, రమేష్, గ్రామానికి చెందిన మరో మహిళ గురువారం తమ సొంత పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై కుప్పం నుంచి సజ్జలపల్లెకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు. మార్గ మధ్యంలో కమతమూరు క్రాస్ వద్దకు చేరుకోగానే అటువైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో రవి, రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన వీరిద్దరినీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జీఓ 114 అమలు చేయాలని హోమం రేపు

కుప్పం: రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజేషన్ చేయాలని, దీనికిగాను జీ ఓ నంబర్ 114ను అమలు చేయాలని కోరుతూ ఆదివారం గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు కాంట్రాక్టు లెక్చరర్స్ అసోసియేషన్ తెలియజేసింది. ఆదివారం పట్టణ సమీపంలోని లక్ష్మీపురం వరదరాజులు దేవాలయంలో నిర్వహించ తలపెట్టిన కార్యక్రమానికి జిల్లాలోని కాంట్రాక్టు లెక్చరర్లు హాజరు కావాలని అసోసియేషన్ కోరింది.

ట్రాఫిక్‌లో 'కుయ్యో..మొర్రో'

- సంత రోజైతే సమస్యల మోత



ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన 108 వాహనం

సదుం: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు సంత రోజున పీలేరు రోడ్డు మార్గంలోని క్రాస్ వద్ద రోడ్డు పైనే దుకాణాలు, వాహనాలను ఇష్టానుసారం పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. సాయంత్రం 108 అంబులెన్సు కూడా కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. అలాగే పుంగనూరు మార్గంలో వంతెన వద్ద రోడ్డుకు ఇరు వైపులా ఆటోలు, వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో కూడా సమస్య తలెత్తుతోంది. సంబంధిత అధికారులు రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయకుండా చూడటంతో పాటు వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పోస్టాఫీసు ఖాతాలకు ఎగబడుతున్న జనం

- అటు ఆధార్ కార్డు కోసం.. ఇటు ఖాతాల కోసం



పోస్టాఫీసుల్లో ఖాతాల ప్రారంభానికి వచ్చిన జనం

కుప్పం: రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలకు సంబంధించి అర్హులైన లబ్ధిదారులకు పోస్టాఫీసుల ఖాతాలకు జమ అవుతాయని నేతల ప్రచారంతో పోస్టాఫీసులో ఖాతాలు ప్రారంభించేందుకు జనం ఎగబడుతున్నారు. కుప్పం ప్రధాన పోస్టాఫీసులో వ్యక్తిగత ఖాతాలు ప్రారంభించేందుకు వస్తున్న జనంతో రెండు రోజులుగా కిటకిటలాడుతోంది. వేలల్లో ఖాతాలు ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులకు అపార్ కార్డు నిమిత్తం ఆధార్ కార్డుల అప్‌డేట్ కోసం నెల రోజులుగా విద్యార్థులు కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రతి మీ-సేవా కేంద్రాలు, ఆధార్ సెంటర్లు, పోస్టాఫీసులు విద్యార్థుల రద్దీతో కనిపిస్తున్నాయి. అలాగే, మరోవైపు పోస్టాఫీసు వద్ద ప్రజలు అగచాట్లు పడుతున్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై మానవహారం



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధికారులు

బైరెడ్డిపల్లె: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం పురస్కరించుకుని బైరెడ్డిపల్లె బాలుర, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం పురవీధుల్లో అవగాహన ర్యాలీ చేశారు. చెక్‌పోస్టు కూడలి వద్ద శుక్రవారం మానవహారం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కన్సల్టెంట్ శాంతి మాట్లాడుతూ, బహిరంగ మలవిసర్జన వలన వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వినియోగించుకోవడం వలన వ్యాధుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లోకనాథం, హెచ్‌ఎంలు గౌహార్ సుల్తాన్, తోయజాక్షి, మండల కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్బరికి నష్టం కలిగిస్తున్న కొడి పురుగులు

- లబోదిబోమంటున్న రైతులు
- సెరికల్చర్ సార్లూ.. ఇటు చూడరూ!



మల్బరి ఆకును తింటున్న కొడి పురుగులు



సాగులో ఉన్న మల్బరి తోట

గుడుపల్లె: మల్బరి తోటలను కొడి పురుగులు ఆశించడంతో పంట నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. మండలంలో మండలంలో 250 కుటుంబాలు మల్బరి సాగుపై ఆధారపడి జీవిస్తున్నాయి. 500 ఎకరాలలో మల్బరి తోటలు పెంచుతున్నారు. మంచు కురుస్తుండడంతో ఈ పురుగుల ప్రభావం ఎక్కువైంది. వీటి నిర్మూలనకు పురుగు మందులు వాడితే రెండు నెలలు మల్బరి పురుగులకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు చెప్పారు. నవంబర్ నుంచి ఫిబ్రవరి ఈ పురుగుల తాకిడి ఉండటం మూలాన రైతులకు దిక్కుతోచడం లేదు. కొడి పురుగులు సులి భాగంలోనే తింటూ అక్కడే ఆకుల మడతలలో నివాసం ఏర్పరచుకుంటుంది. దీంతో సులి పూర్తిగా ఎండిపోవడంతో మొక్కలు ఎదుగదల కూడా ఆగిపోతుంది. ఫలితంగా దిగుబడి తగ్గిపోయి పట్టు పురుగుల పెంపకంపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. వీటి నిర్మూలనకు రైతులు ఏ చర్యలు తీసుకోవాలో సెరికల్చర్ అధికారులు సూచించడంతోపాటు పట్టు పురుగుల పెంపకంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఉంది.